క్లుప్తంగా

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ


లోకనాథంపిళ్లై

శ్రీరంగరాజపురం: మండల తహసీల్దార్‌గా లోకనాథం పిళ్లై శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న షబ్బీర్ బాషా ఏసీబీ దాడుల్లో పట్టుబడిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఉప తహసీల్దార్‌గా విధులు నిర్వహిస్తున్న లోకనాథం పిళ్లైను పూర్తిస్థాయి తహసీల్దార్‌గా నియమిస్తూ కలెక్టర్ హరినారాయణన్ ఉత్వర్వులు జారీ చేశారు. అవినీతికి తావులేకుండా ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యమని లోకనాథం తెలిపారు.

ఉపసర్పంచ్‌కు నివాళి


నివాళులర్పిస్తున్న నాయకులు

శ్రీరంగరాజపురం: మండలంలోని తయ్యూరు ఉపసర్పంచ్ చిరంజీవి (44) అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందారు. మృతదేహానికి జెడ్పీటీసీ సభ్యుడు రమణప్రసాద్ రెడ్డి, ఎంపీపీ సరిత, సర్పంచ్ వరదమ్మ శుక్రవారం నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు. మాజీ జెడ్పీటీసీ సభ్యుడు గురవారెడ్డి, నాయకులు జనార్దన్, బాబు, మణి, గండు, తిరుమల, వెంకటేష్ ఉన్నారు. కాగా తండ్రి మృతి బాధను దిగమింగుకుని చిరంజీవి కుమార్తె మౌనిక ఇంటర్ పరీక్షకు హాజరైంది.

సారా స్వాధీనం.. ఒకరి అరెస్టు


నిందితురాలి అరెస్టు చూపుతున్న పోలీసులు

కార్వేటినగరం: సారా విక్రేతను అరెస్టు చేసి నాలుగు లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ మస్తాన్‌వలి తెలిపారు. కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని శ్రీరంగరాజపురం మండలం సీకే పురం గ్రామానికి చెందిన ఎం.లీలావతి సారా వ్యాపారం నిర్వహిస్తున్నట్లు అందిన రహస్య సమాచార మేరకు దాడులు చేశామని తెలిపారు. 4 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని ఆమెను అరెస్టు చేసి కార్వేటినగరం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం సీఐ నాగరాజుకు అప్పగించినట్లు వెల్లడించారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం


నిర్మాణ పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ

పాలసముద్రం: మండల పరిధిలోని జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణ పనులు వేగవంతం చేయాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్లపై ఉందని ఎంపీడీఓ శ్రీనివాసన్ అన్నారు. శుక్రవారం సర్పంచ్ అనురేఖ, ఎంపీటీసీ లిఖితతో కలిసి గొల్లకండ్రిగ జగనన్న లేవుట్‌ను సందర్శించారు. త్వరితగతిన పూర్తి చేయాలని లబ్ధిదారులకూ సూచించారు. సకాలంలో బిల్లులు మంజూరు చేస్తామని తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రంలో ఉగాది వేడుకలు


ఉగాది పండుగ గురించి వివరిస్తున్న ఉపాధ్యాయిని

నగరి: మండలంలోని నంబాకం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం ఉగాది సంబరాలను నిర్వహించారు. ఉగాది రోజున పాఠశాలకు సెలవు కావడంతో శుక్రవారం పండుగ జరుపుకున్నారు. విద్యార్థులకు ఉగాది పచ్చడి అందించి పండుగ విశిష్టతను వివరించారు.

కాంగ్రెస్ నాయకుల నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నగరి: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీపై బీజేపీ ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆ పార్టీ నాయకులు టవర్ క్లాక్ సెంటర్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం, ప్రధానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రాహుల్ గాంధీపై కేంద్ర ప్రభుత్వం తప్పుడు పరువు నష్టం కేస్ బనాయించి రెండేళ్ల జైలు శిక్ష పడేలా చేశారని తెలిపారు. ఏఐసీసీ మెంబర్ భానుమూర్తి, అల్లా పిచ్చి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ బాబు, నాయకులు చిరంజీవిరెడ్డి, ఢిల్లి, దేశయ్య, గుణశేఖర్, దేశప్పన్ పాల్గొన్నారు.

అతివకు ఆసరా


డ్వాక్రా సంఘాల సభ్యులు

రాష్ట్రంలో వైఎస్ జగన్ సర్కార్ అమలు చేస్తున్న పథకాలతో మహిళలు ఆర్థిక సాధికారత దిశగా అడుగులు వేస్తున్నారు. గ్రామాల్లో కూలి పనులపై ఆధారపడి అరకొరగా జీవనం సాగిస్తున్న వారు ఇప్పుడు ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటుతో స్వయం ఉపాధి, చిరు వ్యాపారాలు చేసుకుంటూ ఆర్థికంగా నిలదొక్కుకుంటున్నారు. వైఎస్సార్ ఆసరా పథకం కింద డ్వాక్రా సంఘాల సభ్యులకు నేడు (శనివారం) మూడో విడత నగదు జమ చేయనున్నారు.

- డ్వాక్రా సంఘాల సభ్యులకు వైఎస్సార్ ఆసరాతో భరోసా
- మహిళల ఆర్థిక సాధికారతకు జగన్ సర్కార్ తోడ్పాటు
- నేడు జమకానున్న మూడో విడత నగదు
- నియోజకవర్గంలో 49,720 మందికి రూ.53.37 కోట్ల లబ్ధి

మండలం	సంఘాలు	సభ్యులు	3వ విడత (రూ.కోట్లలో)
గంగాధరనెల్లూరు	1283	12503	రూ. 15.48
శ్రీరంగరాజపురం	814	7615	రూ. 7.47
కార్వేటినగరం	966	9156	రూ. 9.40
వెదురుకుప్పం	961	9284	రూ. 9.70
పెనుమూరు	887	7686	రూ. 7.79
పాలసముద్రం	432	3926	రూ. 3.50

పాలసముద్రం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మహిళలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోంది. వైఎస్సార్ ఆసరా పథకం అమలుతో మహిళలకు ఆర్థిక స్వేచ్ఛను అందించింది. పొదుపు సంఘాల మహిళలకు ఇచ్చే డబ్బును లబ్ధిదారుల అంగీకారం లేకుండా, సంఘం లేదా సంబంధిత మహిళల వ్యక్తిగత అప్పులకు జమ చేసుకోవడానికి వీల్లేదని బ్యాంకర్లకు స్పష్టం చేసింది. ఆ డబ్బును మహిళలు ఏ అవసరాలకైనా వివియోగించుకోవచ్చని, వీటిపై ఎలాంటి ఆంక్షలు ఉండవని కూడా తెలిపింది. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని స్వయం సహాయక సంఘాల్లోని పేద మహిళల ఆర్థిక పురోగతికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తోంది. ఈ పథకం కింద గంగాధరనెల్లూరు నియోజకవర్గంలో రెండు విడతల్లో 49,720 సభ్యులకు రూ 106.75 కోట్లు మహిళా సంఘాల పొదుపు ఖాతాల్లో జమ చేసింది. మూడో విడత రూ.53.37 కోట్లను శనివారం జమ చేయనుంది.

బాబు హయాంలో దగా

డ్వాక్రా రుణమాఫీ పేరుతో 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ హామీని నిలబెట్టుకోకుండా మహిళలకు మొండి చెయ్యి చూపింది. 2014 ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీ నమ్మి బ్యాంక్ రుణాలు చెల్లించని ఎందరో మహిళలు అప్పుల ఊబిలోకి కూరుకుపోయారు. డ్వాక్రా సంఘాల కార్యకలాపాలు నిర్వీర్యమయ్యాయి. రాష్ట్రంలో జగన్ సర్కార్ ఏర్పాటైన తర్వాత మహిళా సంఘాలు మళ్లీ పుంజుకున్నాయి.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1.50 లక్షలు రుణం తీసుకుని ఉన్నతి కింద మరో రూ.50 వేలు తీసుకుని ఆటో తీసుకున్నాను. నెలకు రూ.10 వేల నుంచి రూ 15 వేలు సంపాదిస్తున్నాను. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం వర్తించింది. ఇప్పటి వరకు వైఎస్సార్ ఆసరా పథకంలో రెండు దఫాలు లబ్ధి పొందాను. ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాను.

– సుమతి, నరసింహాపురం, పాలసముద్రం.

రెండు విడతల్లో రూ.24 వేలు లబ్ధి



మా సంఘం తరపున బ్యాంకు లింకేజీ ద్వారా రూ.1.30 లక్షల రుణం తీసుకున్నా. ఇప్పటి వరకు వైఎస్సార్ ఆసరా పథకం కింద రెండు విడతలుగా రూ.24 వేలు లబ్ధి పొందాను. ఈ డబ్బుతో పాటు స్త్రీనిధిలో కొంచెం డబ్బు తీసుకుని పాడిఆవు కొలుగోలు చేశాను. ఇప్పుడు నెలకు రూ.10 వేలు ఆదాయం వస్తోంది.

– లక్ష్మి, రాచపాళ్యం, పాలసముద్రం

ఆసరాతో ఆర్థిక భరోసా



పొదుపు సంఘం ద్వారా రూ.1.50 లక్షల రుణం తీసుకుని ఊళ్లోనే చికెన్ దుకాణం పెట్టాను. సీజన్ బట్టి నెలకు రూ. 10 వేల నుంచి రూ.20 వేలు ఆదాయం వస్తోంది. ఈ పథకం ద్వారా రెండ విడతలుగా రూ.32 వేలు లబ్ధి చేకూరింది. మా కుటుంబానికి ఆర్థిక భరోసా లభించింది. మాకు అండగా నిలుస్తున్న జగన్‌కు కృతజ్ఞతలు.

– అమ్మాజి, బసివిరెడ్డిపల్లె, శ్రీరంగరాజపురం

మూడో విడత నగదు జమ



వైఎస్సార్ ఆసరా పథకం కింద పొదుపు సంఘాల బ్యాంకు ఖాతాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శనివారం బటన్‌నొక్కి నగదు చేయనున్నారు. ఇప్పటికే రెండు విడతల్లో మహిళలకు నగదు జమ చేశారు. మూడో విడతలో జీడీ నెల్లూరు నియోజకవర్గంలో మొత్తం 49,720 మందికి రూ.53.37 కోట్లు జమ చేయనున్నారు.

– ఫరీద్ మస్తాన్, ఐకేసీ ఏపీఎం, పాలసముద్రం

భక్తిశ్రద్ధలతో శ్రీవారి కల్యాణోత్సవం


హోమ పూజలు చేస్తున్న అర్చకులు

గంగాధరనెల్లూరు: వేపంజేరిలోని శ్రీలక్ష్మీనారాయణస్వామి ఆలయంలో శుక్రవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వేడుకగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవలో స్వామివారిని మేల్కొలిపి నిత్య కైంకర్యాలు చేశారు. మూలవర్లను సుగంధభరిత ద్రవ్యాలతో అభిషేకించారు. వివిధ రకాల పుష్పాలు, ఆభరణాలు, పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. మధ్యాహ్నం 12 గంటలకు స్వామివారి ఆలయం నుంచి ఉత్సవ విగ్రహాలను కల్యాణ మండపానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఉభయదారులు చిత్తూరుకు చెందిన భవాని లక్ష్మీనారాయణ దంపతులను కంకణధారుల్ని చేశారు. భక్తుల హరి నామస్మరణ, వేద మంత్రాల నడుమ కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉభయదారులకు ఆలయ మేనేజర్ వెంకటేశులురెడ్డి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటాన్ని బహూకరించారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహిళలు

పాలసముద్రం: మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని జెడ్పీటీసీ సభ్యుడు అన్బలగన్ అన్నారు. శుక్రవారం పాలసముద్రం గ్రామ సచివాలయంలో వైఎస్సార్ ఆసరా పథకంపై లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆసరా మూడో విడత నగదును శనివారం లాంఛనంగా ప్రారంభిస్తున్నారని తెలిపారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అయ్యప్ప, ఎంపీటీసీ గోవిందరాజు పాల్గొన్నారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం


నగరి: ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది


క్షయ రోగికి ఆహారధాన్యాలు అందజేస్తున్న డాక్టర్ సునీత


పాలసముద్రంలో..


కార్వేటినగరంలో..

నగరి: క్షయ వ్యాధి రహిత సమాజాన్ని నిర్మిద్దామని ఏరియా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ బాలకృష్ణ నాయక్ అన్నారు. శుక్రవారం జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవం సందర్భంగా టీబీ యూనిట్ ఏరియా హాస్పిటల్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. రెండు వారాలకుపైగా దగ్గు, జర్వం, రాత్రిపూట చమటలు పట్టడం, బరువు తగ్గడం, ఆకలి లేకపోవడం వంటి లక్షణాలు ఉంటే డాక్టర్‌ను సంప్రదించి గల్ల పరీక్ష చేసుకోవాలన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ అయిన రోగులు ఆరు నెలల పాటు చికిత్స పొందాలన్నారు. టీబీ నివారణ సులభమే అని.. ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. టీబీ నివారణ పరీక్షలు, మందులు ఆరోగ్య కేంద్రాల్లో ఉచితం అని తెలిపారు. ఆర్ఎంఓ గోపాల్ మాట్లాడుతూ.. క్షయ వ్యాధి నిర్ధారణ, వారికి అందించే సేవలను తెలియజేశారు. వైద్యులు కార్తికేయన్, ప్రవీణ, అంబిక, రాజశేఖర్, జయంత్, ప్రసాద్, నర్సింగ్ సూపరింటెండెంట్ రాజారత్నమ్మ పాల్గొన్నారు.

మందులతో బయటపడొచ్చు

పుత్తూరు రూరల్: క్షయ రోగి డాక్టర్ సలహా మేరకు పూర్తి కాలం మందులు వాడితే వ్యాధి నుంచి విముక్తి పొందవచ్చని ప్రభుత్వ ఆస్పత్రి వైద్యాధికారి శంకర్ నరేన్ అన్నారు. పట్టణంలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆస్పత్రిలో ఉన్న ఆర్టీపీసీ మెషిన్ ద్వారా ఉచితంగా గల్ల పరీక్ష చేయించుకుని క్షయ నిర్ధారణ అయితే ఉచితంగా మందులు పొందవచ్చని తెలిపారు. క్షయ రోగులు మందులతో పాటు పోషకాహారం తీసుకోవాలని చెప్పారు. ప్రభుత్వం క్షయ పోషణ యోజన పథకం ద్వారా ప్రతి నెలా రూ.500 ఇస్తుందని తెలిపారు. డాక్టర్లు రమేష్, అశోక్‌వర్ధన్, ఉదయ్, సునీత పాల్గొన్నారు.

గంగాధరనెల్లూరు: మండలంలోని అగరమంగళం గ్రామంలో సీహెచ్ఓ శ్రీనివాసులు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పాలసముద్రం : వైద్యాధికారి మోహన్‌క్రిష్ణ ఆధ్వర్యంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సకాలంలో స్పందించి మందులు వాడితే నయం అవుతుందని తెలిపారు. అనంతరం ర్యాలీ చేశారు. సీహెచ్ఓ జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి పాల్గొన్నారు.

కార్వేటినగరం: ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారిణి భాగ్యలక్ష్మి వైద్య సిబ్బందితో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్లు గోపినాథ్, మురళీకృష్ణ, పాండియన్, మీనాక్షి, యూసఫ్ పాల్గొన్నారు.

ఇదే చివరి గడువు


పందుల పెంపకందార్లను హెచ్చరిస్తున్న మున్సిపల్ కమిషనర్

నగరి: పట్టణ పరిధిలో ఎక్కడపడితే అక్కడ తిరుగుతున్న పందుల సమస్య పరిష్కారానికి అధికారులు ఇప్పటికే పలుమార్లు పందుల పెంపకందార్లకు హెచ్చరికలు జారీ చేశారు. రెండుసార్లు పందులను పట్టి దూరంగా తరలించారు. ఆపై పందుల పెంపకందార్ల అభ్యర్థన మేరకు కొంత విరామమిచ్చారు. అయితే అధికారులు ఇచ్చిన అవకాశాన్ని అలక్ష్యం చేస్తూ పందుల పెంపకందారులు విచ్చలవిడిగా పందులను వదలిపెట్టేశారు. మళ్లీ స్థానికుల నుంచి ఫిర్యాదులు అందడంతో శుక్రవారం పందుల పెంపకందార్లను మున్సిపల్ కార్యాలయం వద్దకు రప్పించిన మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి వారిని గట్టిగా హెచ్చరించారు. ఈ నెల 30వ తేదీ వరకు చివరి గడువని ఆపై ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. నివాస ప్రాంతాల్లో సంచరించే పందులను పట్టి దూరపు ప్రాంతాల్లో వదలివేస్తామని తెలిపారు.

దళిత ద్రోహి చిట్టిబాబు

వెదురుకుప్పం: ఎస్సీ నియోజకవర్గంలో దళితులకు స్థానం కల్పించకుండా, వారిని అవమానపరుస్తూ రాజకీయంగా అణగదొక్కుతున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి చిట్టిబాబు నాయుడు దళిత ద్రోహి అని వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, మాజీ ఎంపీపీ బట్టే సుబ్రమణ్యం అన్నారు. ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామిపై లేనిపోని ఆరోపణలు చేసి తమ ఉనికిని కాపాడుకోవాలని ప్రయత్నిస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. మంత్రిపై చిట్టిబాబు చేసిన ఆరోపణలను ఖండిస్తూ శుక్రవారం వెదురుకుప్పంలో విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న మంత్రిపై ఆరోపణలు చేయడం తగదన్నారు. దళితులకు టీడీపీలో సముచిత స్థానం కల్పించకుండా కొత్తగా పార్టీలోకి వచ్చిన వారి వద్ద రూ.లక్షలు వసూలు చేస్తున్న వ్యక్తి మంత్రిపై మాట్లాడడం సిగ్గుచేటన్నారు.

9,284 మంది డ్వాక్రా మహిళలకు లబ్ధి

వెదురుకుప్పం: డ్వాక్రా రుణాల మాఫీలో భాగంగా వైఎస్సార్ ఆసరా కింద మూడో విడత మండలంలోని 961 స్వయం సహాయక సంఘాల్లోని 9284 మంది మహిళలకు లబ్ధి చేకూరనుందని వెలుగు ఏపీఎం కవిత శుక్రవారం తెలిపారు. మండలానికి రూ. 9.71 కోట్లు మంజూరైనట్లు చెప్పారు. వీటిని ఆదివారం మధ్యాహ్నం వెదురుకుప్పంలో జరిగే సమావేశంలో ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి చేతుల మీదుగా మెగా చెక్కును అందజేస్తారని పేర్కొన్నారు.

చిరుధాన్యాల్లో మంచి పోషకాలు


పుత్తూరు: చిరుధాన్యాల లాభాలను వివరిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్


పెనుమూరులో అవగాహన కల్పిస్తున్న సీడీపీఓ వినతశ్రీ

పుత్తూరు రూరల్: రాగులు, జొన్నలు, సజ్జలు, కొర్రలు వంటి చిరు ధాన్యాల్లో మంచి పోషకాలు ఉన్నాయని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రోజారమణి అన్నారు. పోషణ్ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం పుత్తూరు మండలం పరమేశ్వరమంగళం హరిజనవాడ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవడం ద్వారా శరీరానికి మంచి పోషకాలు అందుతాయని తెలిపారు. ముఖ్యంగా గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలు చిరుధాన్యాలు తీసుకోవాలని సూచించారు. ఆహారంలో ఆకుకూర ఉండేలా చూసుకోవాలన్నారు. చిరుధాన్యాలతో వంట విధానాన్ని తెలియజేశారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కృష్ణవేణి, ఎంఎస్‌కే నీరజ, అంగన్‌వాడీ కార్యకర్తలు సుగుణ, రాధ, రాజేశ్వరి పాల్గొన్నారు.

వ్యాధినిరోధక శక్తి పెరుగుతుంది

పెనుమూరు(కార్వేటినగరం): చిరుధాన్యాల వాడకంతో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సీడీపీఓ వినతశ్రీ అన్నారు. పెనుమూరు మండల పరిధిలోని పులికల్లు అంగన్‌వాడీ కేంద్రంలో చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలను వివరించారు. రాగులు, సజ్జలు, జొన్నలు తీసుకోవడం వల్ల మంచి ఆరోగ్యం సిద్ధిస్తుందని తెలిపారు. రక్తహీనత సమస్య నుంచి బయటపడవచ్చని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మమత, ఎంఈఓ రుషేంద్ర బాబు, ఉగ్రాణంపల్లి హెచ్ఎం మంజుల, అంగన్‌వాడీ వర్కర్ శైలిజ, ఉపాధ్యాయులు ధనంజయ రెడ్డి, రవి, పవిత్ర పాల్గొన్నారు.

విద్యే ప్రగతికి మూలాధారం


విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ నాగరాణి

వెదురుకుప్పం: విద్యే ప్రగతికి మూలాధారమని ఎంపీపీ నాగరాణి అన్నారు. శుక్రవారం మండలంలోని పచ్చికాపల్లం, వెదురుకుప్పం, నల్లవెంగనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో వార్షికోత్సవ వేడుకలు జరిగాయి. వెదురుకుప్పంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో మెలిగి ఉన్నత చదువులు చదవాలన్నారు. విద్యాభివృద్ధి కోసం ప్రభుత్వం గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. ప్రభుత్వం అందించే ప్రోత్సాహంతో విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం క్రీడాపోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రాధిక, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణారెడ్డి, ఉపాధ్యాయులు బండి ప్రభాకర్‌రెడ్డి, మురళీరెడ్డి, శ్యామల, ఉమామహేశ్వర్, కమలనాభన్ పాల్గొన్నారు.

వృద్ధుల హక్కులపై అవగాహన


వృద్ధుల ప్రణాళిక పుస్తకాలను ఆవిష్కరిస్తున్న ఆర్డీఓ

నగరి: వృద్ధులకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రణాళికలపై ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్ స్థాయి అవగాహన సదస్సు నిర్వహించారు. శుక్రవారం శిరీడ్స్ దివ్యాంగుల పాఠశాల నిర్వాహకుల ఆధ్వర్యంలో ఈ సదస్సు జరిగింది. వృద్ధులకు రాష్ట్ర ప్రణాళికల సంబంధిత పుస్తకాన్ని ఆర్డీఓ సుజన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జాతీయ వృద్ధుల హెల్ప్‌లైన్ కోసం ప్రభుత్వం 14567 నంబర్‌ను ప్రవేశపెట్టిందన్నారు. వృద్ధాశ్రమాలు, సంరక్షణ కేంద్రాలు, హాస్పిటల్ వివరాలు దీని ద్వారా తెలుసుకోవచ్చన్నారు. వృద్ధులను హింసించినా, బయటకు గెంటేసినా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. పెన్షన్ పొందడానికి, చట్టపరమైన సమస్యలు, భావోద్వేగమైన విషయాలను పంచుకోవడానికి ఈ నంబరుకు ఫోన్ చేస్తే సహకారం అందుతుందన్నారు. చిత్తూరు వికలాంగుల శాఖ సీఆర్ ఎండీ జీకే రాజశేఖర్, ఎల్డర్ లైన్ ఎఫ్ఆర్ఓ రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజల చేతిలో పాసుపతాస్త్రం స.హ చట్టం


పట్టాభిరెడ్డిని సన్మానిస్తున్న సభ్యులు

పెనుమూరు(కార్వేటినగరం): ప్రజల చేతిలో పాసుపతాస్త్రం సమాచర హక్కు చట్టమని స.హ చట్టం జాతీయ అధ్యక్షుడు బండి పట్టాభిరెడ్డి అన్నారు. పెనుమూరులో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లోని సమాచారాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవచ్చని అన్నారు. ప్రభుత్వ విభాగాల్లో అవినీతి, అక్రమాల నియంత్రణకు ఇలాంటి చట్టాలు ఎంతో ఉపయోగపడుతాయని పేర్కొన్నారు. అనంతరం మండలంలో నూతన సమాచార హక్కు చట్టం కార్యాలయాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివయ్య, లక్ష్మయ్య, మోహన్‌బాబు, విక్రమ్, శ్రీనివాసులు, గణేష్, గురవయ్య, వరప్రసాద్, సెల్వరాజ్, ఎస్.హెచ్ రామ్ ప్రకాష్, పట్టాభి, రాజేష్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులు సేవా దృక్పథాన్ని అలవర్చుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: విద్యార్థులు చిన్నతనం నుంచే సేవా కార్యక్రమాలపై ఆసక్తి పెంచుకోవాలని ఎంపీపీ లత అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని సుద్దగుంట గ్రామంలో ఎన్ఎస్ఎస్ శిబిరాన్ని కోఆర్డినేటర్ ధనంజయరెడ్డి ప్రారంభించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ఎన్ఎస్ఎస్ కార్యక్రమాలు చేపట్టడం ద్వారా ప్రజల్లో చైతన్యం వస్తుందని, కాలుష్య రహిత సమాజ స్థాపనకు కృషి చేయవచ్చని తెలిపారు. ఈ నెల31వ తేదీ వరకు క్యాంపు కొనసాగుతుందని చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రత, పర్యవరణ పరిరక్షణ, కరోనాపై అవగాహన సదుస్సు నిర్వహించనున్నట్లు కో-ఆర్డినేటర్ ధనంజయరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంపీడీఓ మోహన్‌మురళీ, మండల కన్వీనర్ ధనంజయవర్మ, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వీడ్కోల సమావేశం


బలిజకండ్రిగ హైస్కూల్ విద్యార్థులతో ఉపాధ్యాయులు

నగరి/పాలసముద్రం: నగరి జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, పాలసముద్రం మండలం బలిజకండ్రిగ, పాలసముద్రం హైస్కూల్‌లో శుక్రవారం పదో తరగతి విద్యార్థుల వీడ్కోల సమావేశం, సరస్వతి పూజ నిర్వహించారు. పరీక్షలు ఎలా రాయాలన్న అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు బాగా చదువుకుని తల్లిదండ్రులకు పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వక్తలు సూచించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఆయా కార్యక్రమాల్లో కౌన్సిలర్ భారతి, హెచ్ఎం నమశ్శివాయం, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ కవిత, కుప్పరాజు, బలిజకండ్రిగ, పాలసముద్రం హెచ్ఎంలు మనోహర్ నాయుడు, పూర్వాణి, మాజీ ఎంపీపీ ఇందిరమ్మ, వాసు పాల్గొన్నారు.